క్లుప్తంగా

ఘనంగా మహాపడి పూజ


మహాపడిని వెలిగిస్తున్న స్వాములు

మొయినాబాద్ రూరల్: మొయినాబాద్ మండల అమ్డాపూర్ గ్రామానికి చెందిన కల్యాణ్, రవీందర్‌రెడ్డి ఇంట్లో సోమవారం అయ్యప్ప మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో సర్పంచ్ రవళి గోపికృష్ణారెడ్డి, గురుస్వాములు బాబుమోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భజన మండలి జగన్ మోహన్ ఆధ్వర్యంలో ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పూజల్లో పాల్గొన్న స్వాములు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేశ్, ప్రభాకర్, చిరంజీవిగౌడ్, శ్రీనివాస్‌ముదిరాజ్, మధుసూధన్‌రెడ్డి, వెంకటేశ్, మణికాంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, సాయిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సీపీఐ జిల్లా
కార్యవర్గసభ్యుడు రామస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి రామస్వామి పిలుపునిచ్చారు. చేవెళ్ల మండల కేంద్రంలో సోమవారం నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా నిలబడే పార్టీని ప్రజలు ఎప్పుడు ఆదరిస్తారన్నారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాన్ని పెంచాలని సూచించారు. ఏఐకేఎస్ రాష్ట్రఉపాధ్యక్షుడు ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి మక్బుల్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు సుధీర్, జంగయ్య, బక్కయ్య, శివ, మంజుల, సత్యనారాయణ ఉన్నారు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద

చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న సీఐ

చేవెళ్ల: యువతకు విద్యార్థి లోకానికి స్వామి వివేకానంద ఆదర్శప్రాయుడని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో సోమవారం ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను వివేకానందడు ప్రపంచానికి చాటారని గుర్తుచేశారు. ఈ నెల 12న వివేకానంద జయంతి సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి తెలిపారు. కళాశాల డైరెక్టర్ ఇంద్రాసేనారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు సన్మానం

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను వికారాబాద్‌లోని ఆయన నివాసంలో చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీంభరత్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. సమియుద్దీన్, షారు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

కేశంపేట: ప్రజాపాలనలో ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హులు జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడే అవకాశం ఉందని ఎస్‌ఐ వరప్రసాద్ హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ నంబర్ అడిగే ఇవ్వొద్దని సూచించారు.

సంఘాలతోనే పరిష్కారం

మొయినాబాద్ రూరల్: సభ్యుల సమస్యలను సంఘాలతో పరిష్కరించుకోవచ్చని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. సోమవారం మొయినాబాద్ ఎంపీపీ కార్యాలయంలో పీఆర్‌టీయూటీఎస్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేస్తున్న సంఘాలను గుర్తించాలని కోరారు.

ప్రజా దరఖాస్తు.. పక్కా నమోదు

- వెల్లువలా దరఖాస్తులు
- శరవేగంగా ఆన్‌లైన్ ప్రక్రియ
- తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు
- గడువులోపు కంప్యూటరీకరణ పూర్తి చేస్తాం
- స్పష్టం చేస్తున్న అధికారులు


దరఖాస్తులను కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బంది

షాద్‌నగర్: ప్రజాపాలన దరఖాస్తుల సమాచారం నమోదు శరవేగంగా కొనసాగుతోంది. డిసెంబర్ 28 నుంచి చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీ వినతుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 6తో ముగిసింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది.

జాప్యం జరగకుండా చర్యలు

ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేసే సమయంలో ఏ మాత్రం తప్పులు దొర్లకుండా.. ఏ దరఖాస్తు చేజారకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నెల 17లోపు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా అధికారులు కంప్యూటర్లు సిద్ధం చేయడంతో పాటుగా సిబ్బందిని నియమించారు. సంక్రాంతి పండుగ సెలవుల నేపథ్యంలో డాటా ఎంట్రీ ప్రక్రియకు జాప్యం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

భారీగా దరఖాస్తులు

షాద్‌నగర్ నియోజకవర్గంలో 90వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం, ఠాగూర్ పాఠశాలతో పాటు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖల్లోని కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు ప్రైవేటు ఆపరేటర్ల సహాయంతో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.

- ప్రతి నమోదు కేంద్రంలో ప్రత్యేకంగా సూపర్‌వైజర్లు నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.
- దరఖాస్తుల నమోదు ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆర్‌డీఓలు, మండల, జిల్లా అధికారులు తనిఖీ చేస్తున్నారు.
- ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో తప్పులు దొర్లకుండా అధికారులు చర్యలు చేపట్టారు.
- పంచాయితీ కార్యదర్శులు, మున్సిపాలిటీ వార్డు అధికారులను కూడా అందుబాటులో ఉంచి ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు.

పక్కాగా ఎంట్రీ

కేశంపేట: ప్రజాపాలనలో అర్హులు పెట్టుకున్న ప్రతి దరఖాస్తు పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం విధించిన గడువులోపు ఎంట్రీ చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రజాపాలనలో భాగంగా అధికారులు గ్రామాల్లో గ్రామసభల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. మండల పరిధిలోని 29 గ్రామాల్లో 11,509 గృహాలకు గాను 13,801 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి కంప్యూటర్ ఆపరేటర్లతో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయిస్తున్నారు. దరఖాస్తుల్లో తప్పులుంటే దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి పూర్తి సమాచారంతో అప్‌లోడ్ చేస్తున్నారు.

గడువులోపు పూర్తి చేయాలి



ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం ఈ నెల 17లోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేశాం. తప్పులు దొర్లకుండా వేగంగా గడువులోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం

- వినయ్‌కుమార్, ఎంపీడీఓ, ఫరూఖ్‌నగర్

‘సేవ స్ఫూర్తి’ సేవలు అభినందనీయం

సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్


మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్

షాబాద్: రైతులకు సేవ స్ఫూర్తి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ కొనియాడారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు విజయ్ భాస్కర్‌రెడ్డి రైతులకు సేవ చేయాలనే ఉద్దేశంతో 2020లో ఫౌండేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఆసిరెడ్డిపల్లి, అన్నెబోయినపల్లి గ్రామాల్లో రైతులకు మొదట సేవలు అందిచామన్నారు. తర్వాత షాబాద్ మండలంలోని ముద్దెంగూడ, తిర్మలాపూర్, ఎర్రోనిగూడ, బొబ్బిలిగామ, గోల్లూరుగూడ గ్రామాలకు విస్తరించామని పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అధిక పోషక విలువలు గల వరి సాగు విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. రైతులు పండించిన కూరగాయలు, పంటలు మార్కెటింగ్, కొనుగోలుదారులతో సమావేశం నిర్వహిమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉచిత ప్రమాద, ఆరోగ్య బీమాపై రైతులకు వివరించారు. డ్రోన్‌ల కొనుగోలు, శీతల గిడ్డంగుల నిర్మాణం, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులు, యంత్రాల కొనుగోలు, మార్కెట్ సౌకర్యం నూతన పంటల ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగం, డైరెక్టర్లు వెంకటయ్య, భూపతిరాజు, యాదవరెడ్డి, బాల్‌రాజ్, శేఖర్, యాదయ్య, రాంచంద్రయ్య ఉన్నారు.

విజ్ఞానంతోనే వికాసం...

కమ్మదనం గురుకుల
పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత

షాద్‌నగర్ రూరల్: విజ్ఞానంతోనే విద్యార్థులు వికసిస్తారని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత అన్నారు. విషయ పరిజ్ఞానంతో విద్యను అందించాలని ఆమె సూచించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో జన్య ఫౌండేషన్ కో ఆర్డినేటర్ యాదయ్య ఆధ్వర్యంలో జన్య సైంటిఫిక్, జీవ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్, గణితంలోని అంశాలను ముగ్గుల రూపంలో వినూత్న ప్రదర్శనలు చేపట్టారు. వేస్ట్‌మేనేజ్‌మెంట్, వాటర్ కన్సర్వేషన్, హెల్త్, వెల్‌బీయింగ్, సోలార్ ఎనర్జీ అనే అంశాలపై ప్రదర్శనలు నిర్వహించి ప్రతిభను చాటారు. అనంతరం ప్రిన్సిపాల్ విద్యుల్లత మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరగడానికి, మంచి ర్యాంకులు సాధించడానికి ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం శ్రమిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమలత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ శిరీష, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులను
అందజేస్తున్న ప్రిన్సిపాల్ విద్యుల్లత

గడపగడపకూ అయోధ్య అక్షితలు


అయోధ్య అక్షితలకు
పూజలు చేస్తున్న గ్రామస్తులు

షాబాద్: అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికీ అక్షితల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పూజారి శ్రీను తెలిపారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరాముని అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో ఆలయ నిర్మాణం హిందువుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవీందర్, రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, రాము, కిరణ్, శ్రీను, రాహుల్‌గుప్తా, వెంకటయ్య, మల్లేష్, సత్యం, రాంచందర్, తదితరులున్నారు.

అంక్షితల పంపిణీ

శంకర్‌పల్లి: అయోధ్య అంక్షితలను సోమవారం మండలంలోని మిర్జాగూడ గ్రామంలో మాజీ సర్పంచ్ పంతం సంజీవ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. మహిళలు పూజలు నిర్వహించి, హారతులిచ్చి అక్షితలు స్వీకరించారు. అలాగే మోకిల గ్రామంలో బీజేపీ నాయకులు గడపగడపకూ అక్షితలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశ్, మండల బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సింగ్, మోకిల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సత్యం, నాయకులు లింగం యాదవ్ పాల్గొన్నారు.

శోభాయాత్ర

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో గ్రామంలో సోమవారం అయోధ్య అక్షితలకు శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సర్పంచ్ భూపాలచారి మాట్లాడుతూ రామమందిరాన్ని అయోధ్యలో నిర్మించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, అరవింద్ రెడ్డి, నారాయణ, వెంకటయ్య, బాల్‌రాజ్, వెంకటేశ్, నరేశ్, వీరేశ్, సాయి పాల్గొన్నారు.

పేదలకు వరం కల్యాణలక్ష్మి

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి,
ఎమ్మెల్యే కాలె యాదయ్య


కల్యాణలక్ష్మి చెక్కులు
అందజేస్తున్న రంజిత్‌రెడ్డి, యాదయ్య

మొయినాబాద్: కల్యాణ లక్ష్మి పథకం పేదలకు వరమని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో సోమవారం 88 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకంతో ఎంతో మంది లబ్ధిదారులకు మేలు జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం ద్వారా రూ.1 లక్షతోపాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీఓ సంధ్య, ఆర్‌ఐలు చంద్రమోహన్, రోజ, సర్పంచ్‌లు మంజుల, శ్రీనివాస్, మనోజ్‌కుమార్, మహేందర్ రెడ్డి, ఎంపీటీసీలు అర్జున్, మల్లేష్, నాయకులు జయవంత్ పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే

మండల పరిధిలోని చిలుకూరు సురకంటి భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సదరు పటం తొక్కుట, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్, సర్పంచ్ మంజుల, మనోజ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, నాయకులు జయవంత్, నర్సింహాగౌడ్, పరమేశ్, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరి చారి, రాజేందర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

బంగారు భవితకు బాటలు

- విద్యార్థుల సంక్షేమానికి పెద్ద పీట
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మొక్కలు నాటి నీరు పోస్తున్న శంకర్

షాద్‌నగర్: విద్యార్థుల పట్ల అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించాలని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో నెలకొన్న సమస్యలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా మెరుగైన సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ కుంటు పడిందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం కృషి చేయాలని సూచించారు. అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో శంకర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, నాయకులు తిరుపతిరెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, ఎంఈఓ శంకర్‌రాథోడ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, అధ్యాపకులు భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్యంతోనే అభివృద్ధి

కొందుర్గు: అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండలంలోని లాలాపేట గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. లాలాపేట గ్రామస్తులు తనను ఆదరించారని గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులను ఖర్చుచేయడానికి వెనుకాడేదిలేదని స్పష్టం చేశారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని ఉపాధ్యాయురాలు మౌనిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ పాఠశాల భవనం మరమ్మతులకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ లాలయ్య, సర్పంచ్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు జితేందర్ రెడ్డి, గోపాల్, కావలి యాదయ్య, మల్లేశ్‌గౌడ్, కృష్ణారెడ్డి, అంబదాసు, అంజిరెడ్డి, మదుసూదన్‌రెడ్డి, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


కౌకుంట్ల జిల్లాపరిషత్ 2004-05 బ్యాచ్
ఉపాధ్యాయులు, విద్యార్థులు

చేవెళ్ల: ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులంతా రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. నాటి బాల్య జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 2004-05 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం సమ్మేళనం నిర్వహించారు. చేవెళ్లలోని అంతారం సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో వారంత కలిసి అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు హెచ్‌ఎం వెంకటనారాయణ, ఉపాధ్యాయులు అనంతయ్య, రహీమ్, శివకుమార్, ప్రదీప్‌రావు, మానిక్యం, కృష్ణయ్య, నీలిమ, ప్రసన్నదేవి, ప్రసన్న కుమారి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే దేశాభివృద్ధి

శంకర్‌పల్లి: దేశాభివృద్ధిలో ఎంఎస్ఎంఈలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఇక్ఫాయి విశ్వవిద్యాలయం డైరెక్టర్, ప్రొఫెసర్ వేణుగోపాల్ అన్నారు. చిన్న మధ్య తరగతి పరిశ్రమల పాత్ర అభివృద్ధిలో కీలకమని పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండలంలోని దొంతాన్‌పల్లి గ్రామ శివారుల్లోని ఇక్ఫాయి విశ్వవిద్యాలయంలో ‘అభివృద్ధి చెందుతున్న భారతదేశం, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల పాత్ర’ అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. పలువురు వ్యాపారవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Smt. V. Manjula D/o V. Narsaiah (before marriage) R/o H.No 4-148, Main Road, Shadnagar Town, Farooqnagar Mandal, Ranga Reddy Dist.T.S., hereby state that my name after my marriage with Pulipati Narasimulu was changed as PULIPATI LAXMI (as per Aadhar card). Hence both names are one and same. Cell no:9666333050

స్నేహపూర్వక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

కేశంపేట: హితం కోరే వారే స్నేహితులు. మిత్రుడు కష్టాల్లో ఉంటే తోటి మిత్రులు చలించిపోయారు. చేయిచేయి కలిపి మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన సిల్వేరు శేఖర్ పశువులకు గడ్డిని మిషన్ సహాయంలో కోస్తుండగా ప్రమాదవశాత్తు చేతికి గాయం కావడంతో వైద్యుల సూచన మేరకు తొలగించారు. శేఖర్‌ది నిరుపేద కుటుంబం కావడంతో తోటి మిత్రులు రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, నవీన్‌రెడ్డి, శ్రీను, అక్బర్, నరసింహ, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం వసూలు లక్ష్యంగా..

- పన్నుల సేకరణపై మున్సిపల్ అధికారుల కసరత్తు
- మొండి బాకాయిలపై దృష్టి
- ప్రత్యేక బృందాల ఏర్పాటు


షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయం

షాద్‌నగర్: ఆస్తి పన్నుల వసూలు వందశాతం పూర్తి చేసేందుకు పురపాలక శాఖ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఆర్థిక సంవత్సరం మార్చి నెలతో పూర్తికానుంది. గడువులోపు వందశాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా షాద్‌నగర్, కొత్తూరులో మున్సిపల్ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.

కార్యాచరణ సిద్ధం

ముఖ్యంగా మొండి బకాయిలు వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సుమారు 70 వేలకు పైగా జనాభా ఉన్న షాద్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 15,180 గృహ, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీటి నుంచి సుమారుగా రూ.6కోట్ల 21లక్షల పన్నులు వసూలు అవుతాయి. అయితే ఇప్పటి వరకు సుమారు 52శాతం అంటే రూ.3 కోట్ల 18లక్షలకు పైగా పన్నులు వసూలు చేశారు. ఇంకా రూ.3కోట్లకు పైగా రాబట్టాల్సి ఉంది.

కొత్తూరులో 61.4శాతం వసూలు

కొత్తూరు మున్సిపాలిటీలో సుమారు 13వేల జనాభా ఉంది. ఇక్కడ 2,619 గృహ, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. మొత్తం పన్నులు రూ.2కోట్ల 56లక్షలు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. కోటి 57లక్షలు వసూలు చేశారు. ఇంకా 98 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 61.4శాతం పన్నులు వసూలు అయ్యాయి.

స్పెషల్ డ్రైవ్

షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల్లో పన్నుల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేస్తున్నారు. ఫంక్షన్ హాళ్లు, వ్యాపార సముదాయాలు, ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. బకాయిలు ఉన్న వారి ఇంటింటికీ వెళ్లి మున్సిపల్ అధికారులు సిబ్బంది నోటీసులు అందజేస్తున్నారు.

నోటీసులు జారీ

మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. వివిధ శాఖల అధికారులను పన్నుల వసూలులో భాగస్వాములను చేశారు. అధికంగా పన్నులు చెల్లించాల్సిన వ్యాపారులకు, ఇళ్ల యజమానులకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బకాయిలున్న సినిమా హాళ్లు, పెట్రోల్ బంకులు, థియేటర్లు, గృహ సముదాయాలు, వ్యాపార సంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి



సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో వందశాతం పన్నులు వసూలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాం.

వెంకన్న, కమిషనర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564